సాక్షి
వరంగల్
శుక్రవారం । 24 । ఫిబ్రవరి । 2023



చోరీలకు పాల్పడుతున్న...

ఆలయాలు, ఇళ్లతోపాటు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్ తెలిపారు. -8లో▸



సైఫ్ డిగ్రీని రద్దు చేయాలని...

ప్రీతి ఆత్మహత్యకు యత్నించడానికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్ డిగ్రీ వెంటనే రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాలు ఆందోళన బాట పట్టాయి. -8లో▸

గరిష్టం/కనిష్టం
37.0°/18.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలు, సూర్యరశ్మితో వాతావరణం చాలా వేడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి ఆర్చరీకి ఆర్డీఎఫ్ క్రీడాకారులు



పర్వతగిరి(వరంగల్): రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు కల్లెడ ఆర్డీఎఫ్ అకాడమీ నుంచి 13 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్ తెలిపారు. కల్లెడ ఆర్డీఎఫ్ అకాడమీలో సీనియర్ ఇంటర్ ఆర్చరీ జిల్లాస్థాయి పోటీలు గురువారం నిర్వహించారు. పోటీల్లో 45 మంది క్రీడాకారులు పాల్గొనగా.. బాలుర రికర్వ్ విభాగంలో కె.అచ్యుత్, బి.గంగరాజు, సకిల్, ఎ.వెంకటేష్, బి.భరత్, బాలికల విభాగంలో ఎస్.లావణ్య, ఎం.శారద, పి.విజయలక్ష్మి, ఎం.స్ఫూర్తి, ఎం.అక్షయ, ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో పి.వినయ్, కె.క్రాంతి, బాలికల విభాగంలో ఎస్.అక్షయ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈనెల 26న హైదరాబాద్‌లోని కొల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా.. ప్రిన్సిపాల్ జనార్దన్, కోచ్ ప్రబీర్‌దాస్, ఏఓ ఏకాంబ్రం, వైస్ ప్రిన్సిపాల్ రాజు, రమేశ్, భిక్షపతి, మూర్తి, సునీత, శ్రీలత, మౌనిక రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'



నెక్కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ప్రజలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ అన్నారు. అలంకానిపేట పీహెచ్‌సీ పరిధిలోని వెంకటాపురంలో గురువారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ కుమార్ ప్రారంభించారు. శిబిరాన్ని మధుసూదన్ సందర్శించి.. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరీక్షలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ఇతర ఆరోగ్య కార్యక్రమాలను వైద్యాధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఉషాదయాళ్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, వైద్యాధికారి అరుణ్‌కుమార్, కంటి వెలుగు వైద్యాధికారి జైపాల్‌రెడ్డి, ఆప్తాలమిక్ అనిల్, సూపర్‌వైజర్ మనోజ, గ్రామ కార్యదర్శి సరస్వతి, సిబ్బంది ప్రభ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి



నెక్కొండ: మన ఊరు–మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సమన్వయంతో పూర్తి చేయాలని జేడీపీ ఉషాదయాళ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంఓఎంబీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. మండలవ్యాప్తంగా 25 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయన్నారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ రత్నమాల, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్, ఎంపీఓ కైసర్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు దరిచేరేనా..?

వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసుపై అనేక అనుమానాలు

- తోటి విద్యార్థినులు, ఎంజీఎం, కేఎంసీ అధికారుల తలోమాట
- ఇలా అయితే కేసు పక్కదారి పట్టే అవకాశం ఉందన్న వాదన



ఎంజీఎంలో విచారణ చేస్తున్న ఏసీపీ కిషన్



సాక్షి, వరంగల్: కేఎంసీ అనస్తీషియా విభాగంలో పీజీ ఫస్టియర్ చదువుతున్న వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం కేసు విచారణ దారితప్పే అవకాశం ఉందా.. ఆది నుంచీ ర్యాగింగ్, వేధింపులు లేవని ఇటు ఎంజీఎం ఉన్నతాధికారులు, అటు కేఎంసీ అధికారులు మాట్లాడుతుండటం.. వారు చేసే అంతర్గత కమిటీ విచారణ తూతూ మంత్రంగా సాగుతోందా.. అనే అనుమానాలు పలువురి మెదళ్లను తొలుస్తున్నాయి. వైద్య విద్యార్థిని చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే.. వృత్తిలో భాగంగానే సీనియర్ విద్యార్థి సైఫ్ కొంచెం కటువుగా మాట్లాడి ఉండొచ్చని, ఆమె ఆత్మహత్యాయత్నం చేసేందనడానికి ఏ ఆధారాలు లేవని అంటుండటంతో విచారణ నిష్పక్షపాతంగా జరిగే అవకాశాలు ఏమాత్రం లేవనే వాదన బలంగా వినిపిస్తోంది. చాలా మంది విద్యార్థులు ర్యాగింగ్, వేధింపులు జరిగాయని నోరు విప్పితే ఎక్కడ తమ కెరీర్‌కు ఇబ్బంది అవుతుందన్న ఉద్దేశంతో అసలు ఏమీ కాలేదనట్లుగా మాట్లాడుతున్నారన్న వాదన కూడా ఉంది. అయితే ఈరోజు ప్రీతికి జరిగింది.. రేపు ఇంకొకరికి జరిగినా పరిస్థితి ఇలాగే ఉంటుందని, కేఎంసీ ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని బాధితుల పక్షాన ఎవరూ ఉండరని ఆ కాలేజీలోని కొందరు విద్యార్థులు చర్చించుకోవడం కనిపించింది.

టెక్నికల్ డాటాపై దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నం సంచలనంగా మారింది. దీనిని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ సీరియస్‌గా తీసుకున్నారు. కేసును వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ విచారిస్తున్నారు. బాధితురాలు, నిందితుడి మధ్య వాట్సాప్ చాటింగ్, ఫోన్ కాల్స్... తదితర సాంకేతిక సాక్ష్యాలు ఉన్నాయనే దానిపై కూడా దృష్టి సారించారు. ఇంకోవైపు నిందితుడు సైఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఎంజీఎంలో ఆ ఘటన జరిగిన ప్రాంతానికి సమీపంలో ఉన్న సీసీ టీవీ కెమెరాలను కూడా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం రాత్రి ఈఓటీలో ఆమెతో పనిచేసిన వైద్య విద్యార్థినులు, అక్కడున్న సిబ్బందిని విడివిడిగా విచారించినట్లు తెలిసింది. కాగా.. హైదరాబాద్ నిమ్స్‌లో ఆర్‌ఐసీయూలో చికిత్స పొందుతున్న ప్రీతి ఆరోగ్య పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

ఖాకీలే స్పందిస్తే..

- ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేది కాదేమో...
- ఆమె తండ్రి పోలీసులకు ఫోన్ చేసినా తీయలే.. వాట్సాప్‌లకూ స్పందించలే..
- పోలీసుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందనే వాదన

'మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి. వారిచ్చే ఫిర్యాదులపై ప్రాధాన్యతనుబట్టి త్వరితగతిన విచారించాలి. పోలీసులు ఉన్నారనే నమ్మకం మహిళలకు కలిగించాలి' అని వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నెలరోజుల తర్వాత సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల్లో ఏవీ రంగనాథ్ అన్న మాటలివి..

...అయితే క్షేత్రస్థాయిలో ఆయన మాటలు అమలు కావడం లేదని కేఎంసీలో అనస్తీషియా కోర్సు పీజీ ఫస్టియర్ చదువుతున్న వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటన చెబుతోంది. పోలీసులు సకాలంలో స్పందించి.. సైఫ్ అనే సీనియర్ విద్యార్థిని తమదైన శైలిలో విచారించి ఉంటే బాధిత విద్యార్థినికి భరోసానిచ్చిన వారయ్యేవారు. ఆమె ఇంతటి తీవ్ర నిర్ణయాన్ని తీసుకొని ఉండేది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

సాక్షి, వరంగల్: పోలీసు శాఖలో కొందరు అధికారుల ఉదాసీన వైఖరి బాధితుల పాలిట శాపంగా మారుతోంది. బాధితులకు సంబంధించిన వ్యక్తులు ఫోన్ చేసినా స్పందించిన దాఖలాలు లేవు. చేసేది లేక ఎస్‌ఎంఎస్‌లు, వాట్సాప్ మెసేజ్‌లు పెట్టినా రిప్లయ్ లేని పరిస్థితి. ఈ కోవలోదే వైద్య విద్యార్థిని ప్రీతి కేసు. సైఫ్ అనే సీనియర్ విద్యార్థి జూనియర్ విద్యార్థినులను వేధిస్తున్నాడంటూ వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌కు వాట్సాప్ మెసేజ్, ప్రస్తుత మట్టెవాడ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌చార్జ్ బి.శంకర్‌నాయక్‌కు ఎస్‌ఎంఎస్ పంపినట్లుగా ఉన్న స్క్రీన్ షాట్‌లు సోషల్ మీడియాలో గురువారం వైరల్ అవుతున్నాయి. అయితే ఇవి అసలీవా.. నకిలీవా.. అన్నది పక్కన పెడితే ప్రీతి తండ్రి నరేందర్ పోలీసులను ఆశ్రయించిన మాట వాస్తవమేనని కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ బుధవారం మీడియా సమావేశంలోనే వెల్లడించారు. వారిచ్చిన సమాచారంతోనే అనస్తీషియా విభాగాధిపతి ఆధ్వర్యంలో ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ప్రకటించారు. కేస్ షీట్ రాసే విషయంలో నిర్లక్ష్యంగా ఉండడంతోనే కాస్త గట్టిగా మాట్లాడాల్సి వచ్చిందని సైఫ్ చెప్పిన వాదనతో అక్కడి అధికారులు ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నారు. ఇదే ప్రీతికి భయం కలిగించేలా చేసింది. పోలీసుల వరకు వెళ్లినా భరోసా లభించకపోవడంతో ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లిందనే టాక్ వస్తోంది.

కాగా.. ఈ వ్యవహారంలో వరంగల్ ఏసీపీ, మట్టెవాడ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐగా ఉన్న నరేందర్ పోలీసుల దృష్టికి వేధింపుల విషయం తీసుకొచ్చినా.. నిందితుడు సైఫ్‌ను పిలిచి గట్టిగా మందలించి ఉంటే ప్రీతి ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లేది కాదని ఇటు పోలీసులు, అటు కాలేజీలోని కొందరు విద్యార్థులు అంటున్నారు. ఓ అమ్మాయి ప్రాణం పోయేంతవరకు రావడం పోలీసుల నిర్లక్ష్యమేనని వివిధ పార్టీల నేతలు కూడా ఆరోపిస్తుండడం గమనార్హం. ఘటనకు ముందు నిర్లక్ష్యంగా ఉన్న పోలీసులు.. కేసు విచారణలోనైనా వేగిరంగా పని చేస్తారా.. అనేది వేచి చూడాల్సిందే.. అయితే దీనిపై పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఎలా స్పందిస్తారో చూడాలి.

పోలీసుల అదుపులో సైఫ్?

- రహస్య ప్రాంతంలో విచారణ

ఎంజీఎం : పీజీ వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి ఆమె సీనియర్ సైఫ్ కారణమంటూ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ధరావత్ నరేందర్ చేసిన ఫిర్యాదు మేరకు అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో విచారణ సాగుతున్న క్రమంలో సైఫ్‌పై ఎస్సీ, ఎస్టీ, ర్యాగింగ్, వేధింపుల కేసులు నమోదు చేశారు. పరిస్థితి తీవ్రతను గమనించిన పోలీసులు గురువారం తెల్లవారుజామున సైఫ్‌ను అదుపులోకి తీసుకుని రహస్య ప్రాంతంలో విచారణ సాగిస్తున్నారని తెలిసింది. ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడం లేదు. సైఫ్‌నుంచి పోలీసులు కీలక విషయాలు రాబట్టినట్లు తెలుస్తోంది. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సీనియర్ విద్యార్థి సైఫ్ వేధింపులే కారణమా.. ఇంకామైనా ఉన్నాయనే కోణంలో ఏసీపీ కిషన్ గురువారం ఎంజీఎం ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. అనస్తీషియా వైద్య విభాగాధిపతితోపాటు తోటి విద్యార్థులతో మాట్లాడారు. బుధవారం ప్రీతి విధులు నిర్వర్తించిన ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌ను మరోసారి పరిశీలించారు. ఆమె హాస్టల్ గదిని సైతం పరిశీలించి.. పలు ఔషధాలను సేకరించినట్లు చర్చించుకుంటున్నారు.

పోలీసుల వలయంలో కేఎంసీ, ఎంజీఎం

వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణం, ఎంజీఎం జంక్షన్‌తోపాటు ఆస్పత్రిలో గురువారం భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏబీవీపీ ఆందోళనతో ఉదయం 10 గంటలకే మోహరించిన పోలీసులు, పోలీసు అధికారులు రాత్రి వరకు ఈ ప్రాంతంలోనే విధులు నిర్వర్తించారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధంకండి







గురుకుల కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. పక్కన మంత్రులు ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి, సత్యవతి,సభకు హాజరైన జనం, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కేటీఆర్

ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు

- బహిరంగ సభలో భూపాలపల్లికి వరాల జల్లులు
- ఇంజనీరింగ్ కళాశాల మంజూరు చేయిస్తా..
- మున్సిపాలిటీకి రూ.50కోట్లు, భీంఘన్‌పూర్‌కు రూ.30కోట్లు
- బైపాస్ రోడ్డుకు రూ.135కోట్లు మంజూరు

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: ఎన్నికల సమయం వచ్చేసిందని, యువత సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం, భూపాలపల్లి కేంద్రంలో గురువారం పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు తెలంగాణ తెచ్చిన కీర్తి కంటే ఏ పదవీ గొప్ప కాదన్నారు. కానీ రాష్ట్ర ప్రజలు మరింత అభివృద్ధి చెందడానికి మూడవసారి బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కేటీఆర్ కోరారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరిక మేరకు భూపాలపల్లిలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు విషయమై సీఎం కేసీఆర్‌తో మాట్లాడి మంజూరుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. భూపాలపల్లి మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. భీంఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి పిల్ల చెరువులకు నీటిని పంపింగ్ చేసేందుకు రూ.30కోట్లు మంజూరు చేయించేందుకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఎమ్మెల్యే గండ్ర కోరిక మేరకు భూపాలపల్లి బైపాస్ రోడ్డుకు రూ.135కోట్లు మంజూరు చేశానంటూ, జీఓ కాపీని అందజేశారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మహారాష్ట్రలోని కొందరు సర్పంచ్‌లు తమ గ్రామాలను తెలంగాణలో కలపాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని కోరారని, మన రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇక్కడ కూడా అమలు చేయాలని, లేదంటే తమను తెలంగాణలో కలపాలని రాయ్‌చూర్ ఎమ్మెల్యే శివరాజ్‌పాటిల్ కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రసంగం అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ.261కోట్ల లింకేజీ రుణాల చెక్కులను పంపిణీ చేశారు. 15 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్ల పత్రాలను అందజేశారు. కృష్ణ కాలనీ, సుభాష్‌కాలనీ, యాదవ కాలనీల్లో నివాసముంటున్న సింగరేణి కార్మికులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. స్ట్రీట్ వెండర్ దుకాణాదారులకు హక్కు పత్రాలను అందజేశారు.

సీఎం హైదరాబాద్‌లో ఉన్నాడు..

బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవం, బహిరంగ సభలో యువకులు మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేశారు. ఇందుకు స్పందించిన ఆయన సీఎం హైదరాబాద్‌లో ఉన్నాడంటూ చమత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎంపీ దయాకర్, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, సింగరేణి సీఎండీ శ్రీధర్, కలెక్టర్ భవేష్‌మిశ్రా, అదనపు కలెక్టర్ దివాకర, దివ్యాంగుల అభివృద్ధి సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, రెడ్‌కో చైర్మన్ సతీష్‌రెడ్డి, భూపాలపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, నాయకులు నాగుర్ల వెంకన్న, లింగంపల్లి కిషన్‌రావు, పుల్ల పద్మ, వెంకట్రావ్, రాజిరెడ్డి, మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

టికెట్ గండ్రదే..నా

బీఆర్‌ఎస్ పార్టీ భూపాలపల్లి ఎమ్మెల్యే టికెట్‌పై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెరదించారు. బహిరంగ సభ చివరలో.. 2018 ఎన్నికల్లో మధుసూదనాచారికి టికెట్ ఇస్తే మీరే ఓడించారు అని రెండుసార్లు అన్నారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ ఆయనను శాసన మండలిలో కూర్చోబెట్టారన్నారు. ఇంకా ఐదేళ్ల టైం ఉందని, ఎవరి సామర్థ్యం ఏందో కేసీఆర్‌కు తెలుసన్నారు. గండ్ర వెంకటరమణారెడ్డి సారథ్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుందామని, చెప్పకనే టికెట్ గండ్రదే అని చెప్పేశారు.

మంత్రులు ఏమన్నారంటే..

మధుసూదనాచారికి చేదు అనుభవం

అంతటా వర్గపోరే.. -8లో▸

కేటీఆర్ పర్యటన సాగిందిలా..

- 10.53 గంటలకు గణపురం మండల కేంద్రంలో హెలికాప్టర్ దిగారు.
- 11.25 గంటలకు గణపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ మధుసూదనాచారి చేతుల మీదుగా ప్రారంభింపజేయించారు.
- 12.00 గంటలకు గాంధీనగర్ క్రాస్‌రోడ్‌లో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాల భవనం ప్రారంభం
- రామప్ప కాలనీకి చేరుకొని 12.34 గంటలకు సింగరేణి సంస్థ నిర్మించిన 994 క్వార్టర్లను ప్రారంభించారు.
- మధ్యాహ్నం ఒంటిగంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ప్రారంభం
- 1.23 గంటలకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం
- 1.29 గంటలకు పార్టీ కార్యాలయంలో మొక్కలు నాటారు
- 1.44 గంటలకు దివ్యాంగుల కమ్యూనిటీ హాల్ ప్రారంభం
- 2 గంటలకు వేశాలపల్లిలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించారు.
- 2.20 గంటలకు స్ట్రీట్ వెండర్ షాప్స్ ప్రారంభం
- 2.22 గంటలకు మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రారంభం
- 2.27 గంటలకు మినీ స్టేడియం ప్రారంభం
- 2.29 గంటలకు జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నేడు రాజగోపురం ప్రారంభోత్సవం

- హాజరుకానున్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి
- కొమ్మాల ఆలయంలో రూ.80లక్షల వ్యయంతో నిర్మాణం



పూజలు చేస్తున్న పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, జ్యోతి దంపతులు

గీసుకొండ: సుప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. ఆలయాభివృద్ధికి ఎందరో దాతలు ముందుకొచ్చి సహకారం అందించగా.. గత ఏడాది అక్టోబర్‌లో పలువురు దాతలు రాజగోపుర నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రభుత్వం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం లేనప్పటికీ కేవలం దాతలు ముందుకొచ్చి ఇంత పెద్ద గోపురం నిర్మాణాన్ని పూర్తి చేయడం విశేషం. శుక్రవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి రాజగోపురాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే రంగులు వేసి పనులన్నీ పూర్తి చేశారు.

హాజరుకానున్న మంత్రి ఎర్రబెల్లి

కాగా.. రాజగోపురం ప్రారంభోత్సవానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఎంపీ పసునూరి దయాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, బండా ప్రకాశ్, బస్వరాజు సారయ్య హాజరవుతున్నట్లు పరకాల ఎమ్మెల్యే పీఏ హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ రాజగోపురం నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో రూ.80లక్షలతో నిర్మాణ పనులు పూర్తి చేశారు.

పరకాల ఎమ్మెల్యే చల్లా దంపతుల పూజలు

కొమ్మాల ఆలయం వద్ద రాజగోపురం ప్రారంభోత్సవం కానుండగా.. గురువారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఆయన సతీమణి జ్యోతి ఆలయంలో గోపురం శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు, ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వర్ధన్నపేటలో 'బండి' స్ట్రీట్ కార్నర్ మీటింగ్

వర్ధన్నపేట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం సాయంత్రం 5 గంటలకు వర్ధన్నపేటలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరవుతారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ తెలిపారు. గురువారం రాత్రి శ్రీధర్ ఇతర నాయకులతో కలిసి వర్ధన్నపేట పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బండి సంజయ్ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించేందుకు అనువుగా ఉందా.. అని పరిశీలించారు. ఆయన వెంట నాయకులు పిట్టల కిరణ్, జలగం రంజిత్, కంది క్రాంతి, మహేందర్‌రెడ్డి, చీటూరి రాజు, కొండేటి సత్యం, అనిల్, దేవేందర్, పెద్దూరి రాజు, గిరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

యూనిట్ల పనితీరు నమోదు చేయాలి

- కలెక్టర్ బి.గోపి



మాట్లాడుతున్న కలెక్టర్ గోపి. చిత్రంలో అదనపు కలెక్టర్

వరంగల్ రూరల్: జిల్లాలో దళితబంధు యూనిట్ల పనితీరును క్షేత్రస్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ డాక్టర్ బి.గోపి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని ఎంపీడీఓలు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్లకు దళితబంధు యాప్‌లో యూనిట్ల వివరాల సేకరణపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ డీడీ సురేశ్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తొలివిడతగా 303 యూనిట్లు మంజూరయ్యాయని, వీటి వివరాలను గతంలో ఆఫ్‌లైన్‌లో నమోదు చేశారని తెలిపారు. కొత్తగా వచ్చిన దళితబంధు యాప్‌లో యూనిట్ల వివరాలను చేయాలని సూచించారు. బాగా పని చేస్తున్న, అంతగా నడవని యూనిట్ల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేయాలని అధికారులను ఆదేశించారు. నెలవారీగా అన్ని దళితబంధు యూనిట్ల వివరాలను అధికారులు యాప్‌లో నమోదు చేయాలన్నారు. లాభసాటిగా లేని యూనిట్ల నిర్వహణపై అధికారులు లబ్ధిదారులతో చర్చించి, వారికి కావాల్సిన సహకారం అందించాలన్నారు. రెండో విడత దళితబంధు పథకానికి అర్హులైన వారు మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌డీఓ సంపత్‌రావు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు హవేలి తదితరులు పాల్గొన్నారు.

తుంగబంధం కాల్వపై మొసలి

ఖానాపురం: మండలంలోని పాకాల ఆయకట్టు పరిధి తుంగబంధం కాల్వకు సంబంధించిన బుర్రలను కాల్వలపై మెయింటెనెన్స్ సిబ్బంది మధుకర్, మేరుగు రాజు కట్టుకుంటూ వస్తున్నారు. రోజూ మాదిరిగా బుర్రలు కట్టుకుంటూ వెళ్తుండగా బండమీది కోడె పుసునూరు కాల్వ దగ్గర మొసలి కన్పించింది. భయాందోళనతో కాల్వలో నుంచి బయటకు వచ్చారు. మొసలిని చూసి కాల్వలపై పని చేసే వారితో పాటు రైతులు భయాందోళనకు గురయ్యారు. కాల్వ ల వెంట, పొలాల వద్దకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని ప్రజాప్రతినిధులు సూ చిస్తున్నారు. అధికారులు స్పందించి మొ సలిని పట్టుకుని పాకాల చెరువులో వదిలేయాలని రైతులు కోరుతున్నారు.


కాల్వ గట్టుపై ఉన్న మొసలి

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
AA. CF. No. 371 of 2022
Between :
M/s: Sai Geetham Chit Funds Pvt Ltd., Mahabubabad Branch ... Disputant
And
Sri. Rangu Ramulu & Others ... Opponents
To
1. Sri. Rangu Ramulu, S/o. Yadagiri, Age: 48 Years, Occ: Business. R/o. H.No. 3-81, Bomakal, Mdl: Thorrur, Dist: Warangal - 506318.
2. Sri. Mohammed Sajith, S/o. Shabbeer Ali, Age: 47 Years, Occ: Multi Health Supervisor, Employee Code: 2138299, O/o. Medical Department, PHC Thadicherla, Mdl: Malaherrao, Dist: Jayashankar Bhupalpally - 505184, R/o. H.No. 1-9-1116, Postal Colony, Subedari, Hanamkonda, Warangal - 506001.
5. Sri. Thadur Rajeshwar, S/o. Bhadradri, Age: 46 Years, Occ: Teacher (S.G.T.), Employee Code: 2151184, O/o. MPPS. Lingampally, Mdl: Bachannapet, Dist. Jangaon - 506223. R/o. H.No. 6-3-2, L.B. Road, Mahabubabad - 506 101.
6. Sri. Jalagam Nagesh, S/o. Saidulu, Age: 36 Years, Occ: Business, Nagesh Kiranam, Ravulapalle, R/o. H.No. 11/27, Ravulapalle, Nalgonda - 508280.
7. Sri. Singarapu Dilip Kumar, S/o. Prakash, Age: 42 years, Occ: Junior Assistant, Employee Code: 2150710. O/o. District Cooparative Office, Warangal (R). R/o. H.No. 2-10-833/1, Teacher's Colony, Forest Office, Warangal - 506001.
Take notice that the above dispute is filed against you and you and others for recovery of money. Several times notice were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 10-03-2023 for you appearance. On that day you have to appear in person at 11.00 a.m. Before the Deputy Registrar Refered above. Other wise the case will be decided ex-parte.
Sd/- Deputy Registrar of Chits / Arbitrator, Warangal.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR AT WARANGAL
AA. CF. No. 374 of 2022
Between :
M/s: Sai Geetham Chit Funds Pvt Ltd., Warangal Branch ... Disputant
And
Sri. Vadlakonda Veerender & Others ... Opponents
To
1. Sri. Vadlakonda Veerender, S/o. Maheshwar, Age: 36 Years, Occ: Teacher (S.A.), Employee Code No. 2148240. O/o. U.P.S. Padamatigudem, Mdl: Narsimhulapaet, Dist: Mahabubabad, R/o. H.No. 3-58, Chinnagudur, Mahabubabad - 506104.
3. Sri. Boda Yakub, S/o. Chandru, Age: 33 Years, cc: T.G.T. (Social Studies), Employee Code No. 2124148, O/o. T.G.T. Model School, Mdl: Narsimhulapet, Dist: Mahabubabad, R/o. H.No. 2-62/1, Gundenga Gudur, Mahabubabad, Warangal - 506332, C/o. H.No. 6-1-103/B, Karkarathord, Near: Indira Ground, Mahabubabad.
6. Sri. Kandika Raju, S/o. Sammaiah, Age: 41 Years, Occ: Teacher (S.A. Maths), Employee Code No: 2128288, O/o. Z.P.H.S. Kolanpalli, Mdl: Rayaparthy, Dist: Warangal. R/o. H.No. 2-63, Perumandla Gudem, Panthini, Wardhanapet, Warangal - 506310.
Take notice that the above dispute is filed against you and you and others for recovery of money. Several times notice were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on 10-03-2023 for you appearance. On that day you have to appear in person at 11.00 a.m. Before the Deputy Registrar Referred above. Other wise the case will be decided ex-parte.
Sd/- Deputy Registrar of Chits / Arbitrator, Warangal.

దేశాన్ని పాలించే రోజులు రావాలి

- భూపాలపల్లిలో బహిరంగ సభలో మంత్రి సత్యవతి రాథోడ్

భూపాలపల్లి/భూపాలపల్లి అర్బన్: సీఎం కేసీఆర్ దేశాన్ని పాలించే రోజులు రావాలని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ ఆకాంక్షించారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. తెలంగాణ వస్తే ఏమైతది, కనీసం పాలించుకోవడం రాదని కొందరు అన్నారని.. వారు ఇప్పుడు రాష్ట్రాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారన్నారు. దేశమే మన వైపు చూస్తుంటే కొందరు పగటి వేషగాళ్లు ఏవేవో మాట్లాడుతున్నారన్నారు.

కాంగ్రెస్‌లో తిరిగే వారంతా బ్లాక్‌మెయిలర్స్ : మంత్రి దయాకర్‌రావు


మంత్రి ఎర్రబెల్లితో ముచ్చటిస్తున్న కేటీఆర్

కాంగ్రెస్ పార్టీలోని నాయకులంతా ల్యాండ్ కబ్జాలు, మర్డర్లు చేసేవాళ్లు, బ్లాక్‌మెయిలర్సేనని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్‌లో ప్రజల కోసం జైలుకు వెళ్లిన వాళ్లు ఉన్నారన్నారు. కాంగ్రెస్ మూర్ఖులు పిచ్చి కుక్కల్లా వ్యవహరిస్తున్నారని, వారిని తరిమి కొట్టాలన్నారు. సీఎం కేసీఆర్ దయవల్లనే నియోజకవర్గం ఇంత అభివృద్ధి చెందిందని, మీరు ఏ నిర్ణయం తీసుకున్నా.. కట్టుబడి ఉంటామని ఆయన వెల్లడించారు.

దమ్ముంటే రండి.. పోటీకి సిద్ధం: గండ్ర

నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకే రాజ్యాంగబద్ధంగా టీఆర్‌ఎస్‌లో చేరానని స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. రాజకీయంలో తన ఆస్తులు అమ్ముకున్నాని, నిజాయితీగా సేవ చేశానన్నారు. పార్టీలు మారాను అంటున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఏ పార్టీ నుంచి వచ్చాడని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు ఎర కేసులో చిప్పకూడు తిన్న బ్లాక్‌మెయిలర్ రేవంత్‌రెడ్డికి తనను విమర్శించే అర్హత లేదన్నారు. తాటాకు చప్పుళ్లకు తాను భయపడనని, దమ్ముంటే రేవంత్‌రెడ్డి అయినా మంచిదే లేదా ఆయన అనుచరుడు సత్యనారాయణరావు అయినా సరే ఇక్కడ పోటీకి రావాలని సవాల్ విసిరారు.


మహిళా చిరు వ్యాపారితో కరచాలనం చేస్తూ..


మహిళా సంఘాలకు లింకేజీ రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రులు

మనసున్న మారాజు కేసీఆర్: మధుసుదనాచారి, ఎమ్మెల్సీ

భూపాలపల్లిని జిల్లా చేసిన మనసున్న మారాజు సీఎం కేసీఆర్ అని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. భూపాలపల్లికి సీఎం కేసీఆర్ రెండు పర్యాయాలు వచ్చి వరాల జల్లు కురిపించారని, అలాగే మంత్రి కేటీఆర్ కూడా ఈ నియోజకవర్గాన్ని అవసరమైతే దత్తత తీసుకోవాలని కోరారు. భూపాలపల్లికి ఇంజనీరింగ్ కళాశాల, భీంఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చిన్న చెరువులకు నీరు పారించేందుకు నిధులు, ఒడితల–కాల్వపల్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు.


ఎమ్మెల్యే గండ్రకు రోడ్డు నిధుల జీఓ కాపీని అందజేస్తున్న కేటీఆర్

భూపాలపల్లిని చూస్తే ముచ్చటేస్తోంది: ఎంపీ దయాకర్

భూపాలపల్లిలో సెంట్రల్ లైటింగ్, వంద పడకల ఆస్పత్రి, మెడికల్ కళాశాల నిర్మాణ పనులు.. ఇలా అభివృద్ధి పనులు చూస్తుంటే ముచ్చటేస్తోందని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. బంగారు తెలంగాణలో ప్రతీ ఇంటికి తాగునీరు, రైతులకు సరిపడా సాగునీరు, ఉచిత విద్యుత్ అందుతుందన్నారు. కృష్ణ, గోదావరి జలాలు వృథా కాకుండా సీఎం కేసీఆర్ ప్రాజెక్టులు నిర్మించారన్నారు. దేశాన్ని బాగు చేసుకునేందుకే బీఆర్‌ఎస్ పెట్టారన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, ఎమ్మెల్సీ సిరికొండ

అంతటా వర్గపోరే..

రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటనలో ఆసాంతం బీఆర్‌ఎస్ పార్టీలో వర్గపోరు కనిపించింది. ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి వర్గీయులు నినాదాలతో హోరెత్తించారు. డబుల్ బెడ్ రూంల ప్రారంభోత్సవం, బహిరంగ సభ వద్ద జై సిరికొండ, చారి సాబ్ జిందాబాద్ అంటూ కొందరు నినాదాలు చేయగా.. మరికొందరు జై గండ్ర జైజై గండ్ర అంటూ నినదించారు. బహిరంగ సభలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతున్న సమయంలో అభిమానులు చాలామంది జై సిరికొండ అంటూ నినాదాలు చేయడంతో.. 'మీకు దండం పెడతా, ఆపండి.. ఇది మన కార్యక్రమం, సజావుగా జరగనివ్వండి' అని మంత్రి కోరారు. ఇదిలా ఉండగా సభలో కూర్చున్న పలువురు 'భూకబ్జాదారులు.. ఎమ్మెల్యే అనుచరులు' అంటూ నినాదాలు చేశారు.

కేటీఆర్ పర్యటనలో 'సిరికొండ'కు చేదు అనుభవం!

గణపురం: మంత్రి కేటీఆర్ గణపురం మండల పర్యటనలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసుదనాచారికి చేదు అనుభవం ఎదురైంది. కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు వెళ్తున్న క్రమంలో గణపురం ప్రధాన రోడ్డుపై ఆయన వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తాను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసుదనాచారిని అని తెలపడంతో ఆయన వాహనాన్ని వదిలిపెట్టారు. కానీ ఆయన వెంట వచ్చే నాయకుల వాహనాన్ని సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆగ్రహానికి గురైన సిరికొండ వాహనంలో నుంచి దిగి వచ్చి నన్ను, నా వెంట వచ్చే నేతలను అడ్డుకుంటారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వాహనాన్ని హెలిప్యాడ్ వద్దకు వెళ్లేందుకు అనుమతిచ్చారు. అక్కడ నుంచి హెలిప్యాడ్ వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన మరో బందోబస్తు వద్ద కూడా సిరికొండ వాహనాన్ని నిలిపి ఆయన అధికార పీఏను లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. కాగా.. కేటీఆర్ పర్యటనలో కావాలనే సిరికొండను అడుగడుగునా అవమానించారని ఆయన అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం ఎమ్మెల్సీ కవిత పర్యటనలో టీబీజీకేఎస్ భవన నిర్మాణ శంకుస్థాపన శిలాఫలకంలో సిరికొండ పేరు లేకపోవడం ఆయన వర్గీయులను ఆగ్రహానికి గురిచేసింది. అప్పటి నుంచి ఎమ్మెల్యే గండ్ర వ్యవహారంపై అసంతృప్తితో ఉన్నారు. ఈక్రమంలో కవిత సమక్షంలోనే సిరికొండ, గండ్ర వర్గీయులు పోటా పోటీగా నినాదాలు చేసుకున్నారు. కాగా.. కేటీఆర్ పర్యటనలో సిరికొండ వాహనాన్ని పోలీసులు తెలియక అడ్డుకున్నారా? లేక గండ్ర ఆధిపత్య పోరు కోసం చేయించారా? అని సిరికొండ వర్గీయులు, ప్రజలు చర్చించుకుంటున్నారు.


మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతి

సైఫ్ డిగ్రీని రద్దు చేయాలని ఆందోళనలు

- కేఎంసీ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో..
- ఎంజీఎం గాంధీ విగ్రహం వద్ద బీజేవైఎం నిరసన
- నిరసనకారులను అరెస్టు చేసిన పోలీసులు

ఎంజీఎం: ప్రీతి ఆత్మహత్యకు యత్నించడానికి కారణమైన సీనియర్ విద్యార్థి సైఫ్ డిగ్రీ వెంటనే రద్దు చేయాలని పలు విద్యార్థి సంఘాలు, గిరిజన సంఘాల నాయకులు ఆందోళన బాట పట్టారు. గురువారం ఉదయం కేఎంసీ గేటు ఎదుట పెద్ద ఎత్తున ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆందోళన చేపట్టింది. విషయం ముందే తెలుసుకున్న పోలీసులు పెద్ద ఎత్తున కేఎంసీ గేటు ఎదుట మోహరించి అక్కడికి చేరుకున్న ఏబీవీపీ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ కొన్ని రోజులుగా వేధిస్తున్నాడని ఈవిషయాన్ని గుర్తించడంలో కేఎంసీ, ఎంజీఎం పరిపాలనాధికారులు విఫలమైనట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు కుంట హర్షవర్ధన్, వరంగల్ మహానగర కార్యదర్శి సుజిత్ నయీం, జోనల్ ఇన్‌చార్జ్ మనోజ్, సిద్ధు, శ్రావణ్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ ప్రిన్సిపాల్‌కు వినతి

గిరిజన విద్యార్థి ప్రీతి ఆత్మహత్యకు యత్నించడానికి కారణమైన సైఫ్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని బుధవారం గిరిజన శక్తి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు దారావత్ సురేశ్, వెంకన్న డిమాండ్ చేశారు. ప్రీతి ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌పై కూడా ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ధర్నా చేశారు. అనంతరం ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందించారు.


ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

బీజేవైఎం ఆందోళన

పీజీ సీనియర్ విద్యార్థి సైఫ్ డిగ్రీని వెంటనే రద్దు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బుధవారం సాయంత్రం బీజేవైఎం నాయకులు ఎంజీఎం ఆస్పత్రిలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈవిషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వేధింపులు భరించలేక

- కొడుకును కడతేర్చిన తండ్రి
- ఆ తర్వాత ఆత్మహత్యాయత్నం..


మారపాక నవీన్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: కన్న కొడుకు వేధింపులు భరించలేక ఓ తండ్రి తన కొడుకును హత్య చేసిన అనంతరం తానూ ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన జనగామ జిల్లా తాటికొండ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మారపాక రాజయ్య– రాజమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. దివ్యాంగుడైన చిన్నకుమారుడు నవీన్(29)కు వివాహం కాలేదు. తల్లిదండ్రులు, కొడుకు తాటికొండలోని నివాసంలో ఉంటున్నారు. రాజయ్య వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నవీన్ జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసై తల్లిదండ్రులతోపాటు చుట్టుపక్కల వారి పట్ల అనుచితంగా ప్రవర్తించేవాడు. తనకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులను తరచూ ఇబ్బంది పెడుతున్న నవీన్.. వ్యవసాయ భూమి విషయంలో గొడవకు దిగుతున్నాడు. అనరాని మాటలతో వేధిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారు గిద్దెబండరోడ్డుకు ఉన్న తమ వ్యవసాయ భూమి వద్ద గురువారం పని చేస్తుండగా తండ్రీ కొడుకుల మధ్య గొడవ జరిగింది. దాంతో అక్కడే ఉన్న గొడ్డలి, గడ్డపారతో కొడుకుపై రాజయ్య దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలై నవీన్ అక్కడే పడిపోయాడు. కొడుకు చనిపోయాడని భావించిన తండ్రి క్రిమిసంహారక మందు తాగి స్టేషన్‌ఘన్‌పూర్ పోలీసుస్టేషన్ సమీపానికి రాగానే అపస్మారక స్థితికి చేరుకుని కిందపడ్డాడు. గమనించిన పోలీసులు, స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించి.. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. 'వ్యవసాయ భూమి వద్ద కొడుకును హత్య చేశాను.. నేను క్రిమిసంహార మందు తాగాను.. నా కొడుకు తల్లిదండ్రులని చూడకుండా తరచూ అసభ్యకరంగా మాట్లాడుతున్నాడు.. అందుకే చంపాను' అని రాజయ్య పేర్కొన్నాడు.


ఘటనా స్థలం వద్ద నవీన్


నవీన్ తండ్రి రాజయ్య

కొన ఊపిరితోనే నవీన్..

విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్, రఘునాథపల్లి సీఐ సంతోష్, ఎస్‌ఐ రాజమౌళి ఘటనా స్థలానికి చేరుకునే సరికి.. నవీన్ కొన ఊపిరితో బతికే ఉన్నట్లు గుర్తించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. రాజయ్య పెద్దకుమారుడు భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్

వరంగల్ క్రైం: వరంగల్ కమిషనరేట్ పరిధి దేవాలయాలు, ఇళ్లతో పాటు ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న దొంగలను సీసీఎస్, ఖానాపూర్ పోలీసులు అరెస్టు చేసినట్లు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్‌కుమార్ తెలిపారు. నిందితులు హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన సంగ ప్రణయ్, రంగారెడ్డి జిల్లా బోడుప్పల్‌కు చెందిన ఎస్‌కె.సాహిల్ అలియాస్ సోహెల్, బోడుప్పల్ చెందిన బక్కి సుమన్, యాదాద్రి భువనగిరికి చెందిన కడమంచి సుధాకర్‌ను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వేర్వేరుగా చోరీలకు పాల్పడుతున్న నలుగురి గురించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రణయ్, సోహెల్ రాత్రి పూట దేవాలయాల తాళాలు పగులగొట్టి చోరీలతో పాటు, ద్విచక్ర వాహనాలను చోరీ చేసేవారు. కమిషనరేట్‌లోని కేయూసీ, కాజీపేట, మడికొండ, సుబేదారి, గీసుకొండ పోలీస్‌స్టేషన్లతో పాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని కాసీగూడ, నాచారం పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలు చేసి జైలుకు వెళ్లారు. వీరిద్దరు 2022లో దొంగతనం కేసులో జైలులో కలుసుకున్నారు. బయటకు వచ్చిన అనంతరం కమిషనరేట్ పరిధి ఖానాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, సంగెం 1, ఇంతేజార్‌గంజ్ 1, కేయూసీ 1, చిల్పూరు 2, ములుకనూరు 2, స్టేషన్‌ఘన్‌పూర్ 1 పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. దీంతో పాటు గీసుకొండ పరిధిలో ఇంటి తాళం పగులగొట్టి చోరీ చేశారు. ఇంతేజార్‌గంజ్, లింగాల ఘన్‌పూర్, చిల్పూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేశారు. కాగా.. సుమన్, సుధాకర్ పలు చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరు పాకాల, ఇతర ఏరియాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను ఖానాపూర్ ఎస్సై తిరుపతి అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు.


వరంగల్ క్రైం: నిందితుల అరెస్టు చూపుతున్న సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రమేశ్‌కుమార్

జల్సాల కోసం చోరీలు

చిల్పూరు: జల్సా చేసేందుకు చోరీల బాట పట్టారు. దోచిన సొత్తును అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. చిల్పూరులోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ రఘుచందర్, జనగామ రూరల్ సీఐ సంతోశ్, చిల్పూరు ఎస్సై బొల్లం వినయ్‌కుమార్‌లు నిందితులను అరెస్ట్‌ను చూపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేశాయితండాకు చెందిన భూక్య దేశ్య భీమదేవరపల్లి మండలంలో ఓవిందుకు వెళ్లాడు. అక్కడ అతడి మనస్తత్వానికి దగ్గరగా ఉన్న భీమదేవరపల్లి మండలం వీర్లగడ్డతండాకు చెందిన లావుడ్య సంతోష్, ఒంటిమామిడి తండాకు చెందిన ఓ బాలుడు పరిచయయ్యారు. సంతోశ్‌కు కారు ఉండగా.. అందులో మూడ్రోజుల క్రితం ముగ్గురు చోరీకి బయల్దేరారు. మల్కాపూర్‌లో నల్లతీగల వెంకట్రాజం ఇంటి ఎదుట నిలిపిన కారు టైర్లు మూడింటిని చోరీ చేశారు. అక్కడి నుంచి దేశ్య స్వగ్రామం దేశాయితండాకు వెళ్లారు. ఆరాత్రి టైర్లను పొదల మాటున దాచి దేవాదుల రిజర్వాయర్‌లోకి దిగి రెండు మోటార్లను చోరీ చేశారు. వాటిని కూడా పొదల మాటున దాచారు. కాగా బుధవారం తమ మోటార్లు, కారు టైర్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారంటూ బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పెట్రోలింగ్ చేపట్టారు. చోరీ సొత్తును అమ్మకానికి తీసుకెళ్లేందుకు పొదల వద్దకు వెళ్లారు. కారు, ముగ్గురు వ్యక్తులు, చోరీ సొత్తు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి జనగామ సబ్‌జైలుకు తరలించారు. మొత్తం సొత్తు విలువ రూ.96 వేలు ఉంటుంది.

మేడపల్లిలో మెగా వైద్యశిబిరం



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

- యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో సేవలు

నల్లబెల్లి: హైదరాబాద్ యశోద ఆస్పత్రి యాజమాన్యం మండలంలోని మేడపల్లిలో ఏర్పాటు చేసిన యశోద సేవా కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. మేడపల్లి, రాంపూర్ జంట గ్రామాలతో పాటు మండలంలోని పలు గ్రామాల ప్రజలు వైద్య శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్ యశోద ఆస్పత్రికి చెందిన కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్, చిల్డ్రన్స్, ఆర్థో, ఈఎన్‌టీ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాంపూర్ సర్పంచ్ చింతపట్ల సురేశ్ మాట్లాడుతూ.. సొంత గ్రామంపై మమకారంతో యశోద ఆస్పత్రి యాజమాన్యం యశోద సేవా కేంద్రం ఏర్పాటు చేసి అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈవైద్య శిబిరంలో యశోద ఆస్పత్రి వైద్యులు వెంకట్‌రెడ్డి, వరుణ్‌కుమార్ రెడ్డి, మనిసిగ్‌రన్, జోత్స్న, దేవేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, శివాని, అర్షద్, ధీరజ్, వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి ఒకరి మృతి

దుగ్గొండి: మండలంలోని గోపాలపురం శివారులో ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి గురువారం సాయంత్రం నర్సంపేట మండలం ముత్తోజీపేట గ్రామానికి చెందిన సామల భిక్షపతి(55) మృతి చెందాడు. భిక్షపతి బుధవారం గోపాలపురంలో ఓ శుభకార్యానికి హాజరయ్యాడు. బహిర్భూమికని వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తు కాలుజారి కెనాల్‌లో పడ్డాడు. గురువారం మధ్యాహ్నం మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు పోస్ట్‌మార్టం కోసం నర్సంపేట మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.


భిక్షపతి మృతదేహం

ఆర్థిక ఇబ్బందులతో చిరువ్యాపారి ఆత్మహత్య


కృష్ణ (ఫైల్)

సంగెం: ఆర్థికబాధలు తాళలేక మండలంలోని కుంటపల్లికి చెందిన ఊర కృష్ణ(47) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిక్కు వెంట్రుకలు, బోళ్ల వ్యాపారం చేస్తూ కృష్ణ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె వివాహమైంది. కాగా.. ఆమెకు కట్నకానుకలు ఇంకా ఇవ్వాల్సి ఉంది. ఆర్థిక ఇబ్బందులతో కృష్ణ తరచూ మదనపడేవాడు. ఈనేపథ్యంలో తరచూ మద్యం తాగేవాడు. కృష్ణను భార్య లలిత బుధవారం మందలించింది. మనస్థాపం చెందిన అతడు గురువారం ఉదయం ఇంటి సమీపంలో నిద్రకు ఉపక్రమించాడు. కృష్ణ నోటి నుంచి నురుగు రావడంతో గమనించిన స్థానికులు లలితకు సమాచారం ఇచ్చారు. స్థానికులు ఎంజీఎంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు కృష్ణ అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. కాగా.. ఆర్థిక బాధలు తాళలేక విషగుళికలు మింగి అతడు ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

బంధువుల వేధింపులతో వివాహిత బలవన్మరణం

కాజీపేట: బంధువుల వేధింపులతో మనస్తాపానికి గురైన వివాహిత వర్ష కుమారి (24).. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు కాజీపేట పీఎస్‌లో మృతురాలి తండ్రి రాజ్‌కుమార్ సింగ్ గురువారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.